క్లుప్తంగా

31న మెగా జాబ్ మేళా

కురబలకోట: రాష్ట్ర నైపుణ్యాభివృదిధ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న మండలంలోని విశ్వం డిగ్రీ ,పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 20 కార్పొరేట్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బిటెక్, పీజీ చదివిన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుండి రూ. 30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ప్రభుచరణ్

వాల్మీకిపురం: నిరుపేదలు చలికాలంలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆదివారం స్థానిక కొత్తపేటవీధిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రభుచరణ్ మట్లాడుతూ తెలంగాణకు చెందిన ఆష్రి సంస్థ అధినేత పూర్ణిరెడ్డి సహకారంతో తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పూర్ణిరెడ్డి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

31న ఉచిత మెగా వైద్య శిబిరం

కలకడ : మండల కేంద్రంలో ఈనెల 31 నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సన్‌షైం ఆసుపత్రి డీఎంఓ వెంకటేశ్ కోరారు. కలకడ పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణంలో అన్ని జబ్బులకు ఉచితంగా చికిత్స చేసి, అవసరమైనవారికి మందులు కూడా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఆదివారం కలకడ, చుట్టుపక్కన గ్రామాల్లో ఆటోలో మైక్‌ద్వారా, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రచారం నిర్వహించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ


ట్రాన్స్‌కో ఈఈ మునిచందర్

పీలేరు : ఏపీఎస్‌పీడీసీఎల్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఆవశ్యకత విద్యుత్ చార్జీల ప్రాతిపాదనలపై సోమవారం నుంచి మూడు రోజుల పాటు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపడుతున్న పీలేరు ట్రాన్స్‌కో ఈఈ కె. మునిచందర్ అన్నారు. మూడు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు లైవ్ కార్యక్రమం ద్వారా అభిప్రాయాలు సేకరించనున్నట్లు చెప్పారు. జస్టిక్ సి.వి. నాగార్జునరెడ్డి పర్యవేక్షణలో ప్రజాభిప్రాయం సేకరించనున్నట్లు తెలిపారు.

కౌలుకు ఆలయ భూముల వేలం

నిమ్మనపల్లె : మండలంలోని తవళం గ్రామంలో వెలసిన శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను కౌలుకు 3 సంవత్సరాల కాలానికి బహిరంగ వేలం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో తవళం గ్రామంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తు ముందుగా చెల్లించి వేలంలో పాల్గొని ఆలయ వ్యవసాయ భూములను కౌలుకు దక్కించుకోవచ్చని తెలిపారు.

పెద్దేరు పార్కులో అగ్నిమంటలు


మంటల్లో కాలిపోయిన పూలమొక్కలు

తంబళ్లపల్లె : మండలంలోని కొటాల పంచాయతీలో ఉన్న పార్కులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పలురకాల పూలమొక్కలు, డ్రిప్ పైప్‌లు కాలిపోయాయి. సందర్శకుల కోసం రెండేళ్ల క్రితం ఉపాధిహామీ నిధులు సుమారు రూ.30 లక్షలు ఖర్చుచేసి పార్కును ఏర్పాటు చేశారు. రకరకాల పూలమొక్కలతో, ప్రాజెక్టుకే కళ వచ్చింది. సందర్శకులను సైతం ఈ పార్కు ఆహ్లాదపరిచేది. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పనికి పార్కు అగ్నికి ఆహుతై కళావిహీనంగా మారింది. ఆదివారం పెద్దేరు ప్రాజెక్ట్ చూసేందుకు వచ్చిన సందర్శకులు పార్కు మంటలకు ఆహుతి కావడంపై విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ఈ పార్కును పునరుద్ధరించి సంరక్షించే చర్యలు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

శిథిలావస్థలో రంగినీ మహల్


రంగినీ మహల్ ముఖచిత్రం


రంగినీ మహల్ భవనం ముందు వైపు పైకప్పు కూలిపోయిన దృశ్యం

- భవనం పెకప్పు దెబ్బతిని ఓవైపు కూలిపోయిన వైనం
- పట్టించుకోని పురావస్తు శాఖ అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న పర్యాటకులు

గుర్రంకొండ: గుర్రంకొండ కోటలోని ప్రఖ్యాత రంగినీ మహల్ శిథిలమైపోయి ఓ వైపు కూలిపోయింది. గతంలో కురిసిన వర్షాలకు భవనం పైకప్పు దెబ్బతిని ముందరవైపు భాగం కూలిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చారిత్రాత్మక కోటలో ముఖ్యమైన పర్యాటక ప్రదేశం రంగినీ మహల్. కోట ముఖద్వారం దాటుకోగానే మొదటగా కనిపించేదే ఈ మహల్. పూర్వం నవాబులు తమ ఆస్థానంలోని ఆస్థాన నాట్యగత్తెగా ఉన్న రంగమ్మ పేరుతో ఈ మహల్ నిర్మించారని చరిత్ర చెబుతోంది. మహల్ ముందువైపు రెండు అంతస్థులుగానూ, వెనుకవైపు మూడు అంతస్థులుగా కనిపించడం ఈ మహల్ ప్రత్యేకత. ఇంతటి ప్రాశ్యస్థమున్న ఈభవనం వైనుకవైపు రెండో అంతస్థ పైకప్పు ఓవైపు పూర్తిగా దెబ్బతిని కుంగిపోయింది. ఇటివల కురిసిన వర్షాలకు ఉన్నట్టుండి ధ్వజస్తంభం రెండుగా చీలిగా పోయి పైకప్పు దెబ్బతిని ఒరిగిపోయింది. ముందుభాగంలో ఉన్న పైకప్పు ఓవైపు పూర్తిగా కూలిపోయింది. మిగిలింది ఎప్పుడు కూలిపోతోందో తెలియక పర్యాటకలు భయాందోళన చెందుతున్నారు. ప్రతినిత్యం ఈ మహల్‌ను సందర్శించ డానికిగాను పెద్ద ఎత్తున పర్యాటకులు ఇక్కడికి విచ్చేస్తుంటారు. గత నాలుగేళ్లగా భవనం దెబ్బతింటున్నా పురావస్తుశాఖ అధికారులు పట్టించుకొన్న ధాఖలాలు లేవు. రెండేళ్ల క్రితం మరమ్మతుకు నిధులు మంజూరు అయాయ్యని హడావిడి చేశారు. అయితే మరమ్మతు పనులు చేపట్టలేదు. ప్రస్తుతం భవనానికి మరోవైపు పైకప్పు దెబ్బతింటోంది. పురాతన కాలపు తీర్లు(కొయ్యలు) చెదలపట్టి నేడురేపో కూలిపోయేదశకు చేరుకొన్నాయి. దీంతో అటువైపు పర్యాటకులు వెళ్లాలంటే హడలెత్తిపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

- నిరుపేదలకు సీఎం సహాయనిధి కొండంత అండ
- ఆరుగురికి రూ.17లక్షల 60వేల చెక్కులు పంపిణీ
- ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతం చేసిన సీఎం వైఎస్ జగన్


సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్, చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సొసైటీకాలనీ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి మాట్లాడుతూ...ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని ప్రవేశపెడితే, ఆయన కుమారుడిగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దానికి మరింత మెరుగులు దిద్ది సామాన్యులకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. దీంతో గుండె, కిడ్నీ, న్యూరో లాంటి ఎంత పెద్దజబ్బులకైనా చేతి నుంచి చిల్లగవ్వ ఖర్చుచేయాల్సిన అవసరం లేకుండా నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్యం అందుతోందన్నారు. వైద్యరంగంలో సంస్కరణల్లో భాగంగా.. నాడు–నేడు కార్యక్రమం కింద రాష్ట్రంలోని ప్రతి ఆస్పత్రి రూపురేఖలను మార్చారన్నారు. వైద్యరంగానికి పెద్ద మొత్తంలో నిధులు ఖర్చుచేస్తూ, ప్రభుత్వ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. కరోనా కష్టకాలంలోనూ దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసానిచ్చారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలను చేరువచేశారన్నారు. సమన్వయకర్త నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఇప్పటివరకు జగనన్న ప్రభుత్వంలో రూ.50 కోట్లకు పైచిలుకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మదనపల్లెలో మెడికల్ కాలేజిని ఏర్పాటుచేశారని, త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న నిమ్మనపల్లె మండలం యర్రాతివారిపల్లెకు చెందిన వి.జిష్ణువర్ధన్‌రెడ్డికి రూ.1లక్ష 60 వేలు, మదనపల్లె బసినికొండకు చెందిన ఎన్.నాగరాజుకు రూ.5 లక్షలు, అమ్మినేనివీధికి చెందిన ఏ.ఆర్.సతీష్‌కుమార్‌కు రూ.5 లక్షలు, దేవళంవీధికి చెందిన షేక్.మహమ్మద్ ఇర్ఫాన్‌కు రూ.1లక్ష 20వేలు, నెమలినగర్‌కు చెందిన రెడ్డెప్పలక్ష్మణ్‌నాయక్‌కు రూ.1లక్ష, రంగారెడ్డికాలనీకి చెందిన సయ్యద్‌అయేషాఖదీర్‌కు రూ.3 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారథి, వెలుగుచంద్ర, టెలికాంఅడ్వైజరీ బోర్డ్ మెంబర్ హర్షవర్ధన్, నాయకులు లియాఖత్‌అలీ, గుండ్లూరురఫీ, సుజనాబాలకృష్ణారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సురేంద్ర, బండపల్లివెంకటరమణ, ఎల్‌ఐసీ.సుధాకర్, సలీం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో నాణ్యమైన దిగుబడి


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి

పీలేరు రూరల్ : సస్యరక్షణ చర్యలతో మామిడిలో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తలపులలో అన్నమయ్య రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మామిడి సస్యరక్షణలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలు, మామిడిలో పూత దశ నుంచి కాయలు కోత వరకు యాజమాన్య చర్యలు, మందుల పిచికారి, ఫ్రూట్ కవర్. పండు ఈగ బుట్టల ప్రాధాన, పొటాషియం నైటేట్ పిచికారి, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మామిడిలో వచ్చే వివిధ రకాల సమస్యలు, వాటి పరిష్కారాలను తెలుసుకుని నాణ్యమైన దిగుబడికి కృషి చేయాలన్నారు. పూమొగ్గలు ఉత్తేజపరిచి పూతరావడానికి, డపూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్ (మల్టీకే) 13.0.45ను 10 గ్రాములు, ఫార్ములా 4 లేదా ఆర్క మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, మురళి, ఏపీఎల్‌ఐపీ ప్రతినిధి భోజరాజు, ప్రముఖ మామిడి శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి, అన్నమయ్య రైతు సహకార సంఘం చైర్మన్ జయబ్బనాయుడు, కేవీకే శాస్త్రవేత్తలు బాలకృష్ణ, పీరుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభను గుర్తించేందుకే ఆడుదాం-ఆంధ్ర


రన్నర్ కప్, మెమెంటో చూపుతున్న ఖోఖో జట్టు సభ్యులు

కలకడ : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించడం కోసం ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తోందని కోన ఖోఖో టీం కెప్టెన్ మమేష్ అన్నారు. పీలేరులో శనివారం రాత్రి వరకు నిర్వహించిన నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో ఖోఖో క్రీడలో రన్నర్‌గా నిలచిన కోన జట్టు సభ్యులు ఆదివారం గ్రామంలో వారి ఆనందాన్ని పంచుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం క్రీడాకారుల్లో నూతన ఉత్తేజం నింపిందన్నారు. కేవలం సచివాలయ స్థాయికే పరిమితం కాకుండా, మండల స్థాయి, నియోజకవర్గస్థాయిలో 50కి పైగా జట్లు క్రీడల్లో పాల్గొన్నాయన్నారు. కప్, మెడల్‌తో పాటు రూ. 15వేల నగదు అందజేయడం ఆనందాన్ని నింపిందని తెలియజేశారు.

దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు

రాయచోటి టౌన్ : దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల ఆవరణలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 250 సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి 30 కుర్చీలు, రెండు టేబుళ్లు, ఒక బాడీ ఫ్రీజర్ వితరణగా అందజేశారు. అలాగే రాయచోటి సొసైటీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి సహకారాన్ని గుర్తించి ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతు లోకేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. సంస్థ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు విన్నవించామని ఇందుకు సానుకూల స్పందన లభించిందని చెప్పారు. అనంతరం సంవత్సరం కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల వివరాలను తెలిపే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటరమణ నాయుడు, అరమాటి శివగంగిరెడ్డి, వెంకటరమణ, షకీల్, రెడ్డెన్న తాతిరెడ్డి, శేషారెడ్డి, పీరయ్య, రెడ్డప్పరెడ్డి, వెంకటరామరాజు పాల్గొన్నారు.

ఏపీఎంఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక


శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏపీఎంఎఫ్ సభ్యులు

మదనపల్లె సిటీ : మదనపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా ఏపీఎంఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఏపీఎంఎఫ్ జిల్లా అధ్యక్షులుగా కే.విజయకుమార్, జనరల్ సెక్రటరీగా భాస్కర్, కోశాధికారిగా డి.భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా వెంకట్రామయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా హరివిజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఏపీఎంఎఫ్ సమావేశం సందర్భంగా గణితపితామహుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకరరెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ..కరుణించమ్మా


అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. పలువురు మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించుకొన్నారు. అలాగే అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్‌కు మైనార్టీ నాయకుల వినతి


ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందిస్తున్న మైనార్టీలు

వాల్మీకిపురం: స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్ర ప్రదేశ్ మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో మహిళా డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అఫూ మొహియుద్దీన్ కోరారు. ఆదివారం రాయచోటిలో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలు అన్ని విభాగాల్లో వెనుకబడి ఉన్నారని, నిరక్షరాస్యతులను ప్రత్యేకంగా మహిళలను అభివృద్ధి పరచడానికి వాల్మీకిపురంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం, నిమ్మనపల్లి మండలాలకు అనుగుణంగా వాల్మీకిపురం పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మైనార్టీలు ఎజాజ్ అహ్మద్ ఖాన్, గౌస్, సందాని బాషా, విశ్రాంత తహశీల్దార్ రమణ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

– నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్


నిసార్‌అహ్మద్‌కు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిమ్మనపల్లె : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మన మందరం కలిసికట్టుగా పనిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. ఆదివారం తవళం పంచాయతీ నల్లంవారిపల్లెలో ఆయన పర్యటించారు. నాయకులు, కార్యకర్తలు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రమేష్ ఆధ్వర్యంలో నిసార్‌అహ్మద్‌కు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహాయసహకారాలతో కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికలు మరో రెండునెలల్లో ఉన్నందున ఐకమత్యంతో ఉంటూ వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. త్వరలోనే వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి నియోజకవర్గ పర్యటనను ప్రారంభిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించి పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి, టెలికంఅడ్వైజరీబోర్డ్ మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొమ్మేపల్లెశ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, యుగంధరరెడ్డి, వలసపల్లెరమణారెడ్డి, శంకర, గంగాధర, రవి, గోపాలకృష్ణ, రెడ్డి, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ ద్వారా ఉచిత సేవలు


మాట్లాడుతున్న మానవత జిల్లా శాఖ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులురెడ్డి

కలకడ : మండలంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా కేవలం ఫ్రీజర్ బాక్స్‌లు పంపడం, మృతి చెందిన సమయంలో మృతదేహాలను ఉచితంగా చేర్చడమే కాకుండా విద్య, వైద్యం, మొక్కల పెంపకం వంటి మరిన్ని ఉచిత సేవలను మండలంలో చేపట్టాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎ.శ్రీనివాసులురెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి కోరారు. ఆదివారం కలకడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆ సంస్థ మండలశాఖ చైర్మన్ సుధాకర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీలాలా లజపతిరాయ్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. ప్రభుత్వ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడం, పరీక్షల సమయంలో వారికి సహాయం చేయడం కలకడ మానవత స్వచ్ఛంద సంస్థ ప్రాంగణం అభివృద్ధి చేయడం, మొక్కలు నాటి పోషించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ సభ్యులు నిర్ణయించారు. ఉచిత సేవలు కొనసాగించడానికి ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు గంగాద్రి నాయుడు, వైవి రమణ, వెంకటేశ్వర, రమణ, కాజాఫీర్, మోహన పాల్గొన్నారు.

నాటు సారా విక్రేతల అరెస్టు


నాటు సారా విక్రయదారులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కలికిరి: నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. వివరాలిలా... కలికిరి పట్టణ పరిధిలో నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విస్తృత దాడులు నిర్వహించగా పాత బస్టాండ్ ఏరియాలో సారా విక్రయిస్తున్న మహిళ తులసిని, ఇందిరమ్మకాలని ప్రాంతంలో సారా విక్రయిస్తున్న గంగాధర్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా వీరికి రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. నాటు సారా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందని, పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. విక్రయదారులు స్వచ్ఛందంగా విక్రయాలను నిలిపివేయాలని పోలీసులు హెచ్చరించారు. దాడులలో హెచ్‌సీలు కొండప్ప, మనోహర్, రాజేంద్రప్రసాద్, పీసీలు వెంకటసిద్దులు, జిలానీ, దినేష్, గాయత్రి, సరస్వతిలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

మదనపల్లె సిటీ : మండలంలోని పుంగనూరు రోడ్డు ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో 2009–2013, 2010–2014 సంవత్సరాలకు చెందిన పూర్వ విద్యార్థులు, పూర్వ అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందించారు. తాము చదువుకునే రోజుల్లో కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపకులు తమకు ఎంతో సహకరించి, కరమశిక్షణతో కూడిన విద్యను అందించారని, వారి సహకారంతో నేడు వివిధ కంపెనీలలో ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నామని విద్యార్థులు వివరించారు. కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ..తమ కళాశాలలో చదివి వివిధ రంగాల్లో ఉన్నతస్థాయి ఉద్యోగాలను చేస్తూ నేటికీ క్రమశిక్షణతో ఉన్నందుకు అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆనందంగా ఉందన్నారు. అలాగే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని, ఎన్నో సామాజిక సేవలు చేయాలని వివరిస్తూ బహుమతులు అందజేశారు.

వైభవంగా మహా పూర్ణాహుతి



విశేష అలంకరణలో కామేశ్వర స్వామి, హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలోని శ్రీ కామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించి, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష అలంకరణ, నవ చండీ హోమం కార్యక్రమాలను అనంతపురం శ్రీ శివకోటి పీఠం వ్యవస్థాపకులు అప్పా స్వామి ఆధ్వర్యంలో వారి శిష్య బృందం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో శీనా స్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.